

12 వరకూ ఓటర్ల జాబితా సవరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా క్లెయిములు, అభ్యంతరాల పరిశీలనకు, సమోదయ ఎన్నికల కమిషన్ ఈనెల 12వ తేదీ వరకూ గడువు పొడిగించిందని, పూర్తిస్థాయిలో ఓటరు జాబితాకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నియోజకవర్గ ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు. గురువారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఎలక్టోరల్‌కు సంబంధించి పిడబ్ల్యూ ఓటర్లు ఎక్కువగా తగ్గడానికి గల కారణాలపై, అలాగే 18-19 సంవత్సరాల వారు ఓటర్లుగా నమోదు కాకపోవడానికి గల కారణాలు, ప్రొసెసిటీ ఓటర్ల గురించి, ఫారం-6 ద్వారా 18 సంవత్సరాలు దాటిన వారు ఓటరు నమోదు, ఆన్ లైన్, ఆఫ్ లైన్ అప్లికేషన్లు, మరణాలు, వలసల కారణాల గురించి జండర్ రేషియో గురించి, ఫారం డిస్పోజబుల్ పంపిణీ స్టేటస్, ఇప్పటి వరకూ స్వీకరణ, పోలింగ్ స్టేషన్లు, లొకేషన్లు, కలెక్టర్ తదితర అంశాలపై కలెక్టర్ నియోజకవర్గాల వారీగా సమీక్షించారు.

రబీ 'సాగు'తోంది..!

ఇంకా పూర్తికాని నారుమడులు
డెల్టా రైతాంగంలో తీవ్ర ఆందోళన
ఫిబ్రవరిలోనూ కొనసాగనున్న నాట్లు
దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి
నీటి ఎద్దడి సమస్యపై రైతుల్లో గుబులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ సాగు అదును దాటుతోంది. మిచౌంగ్ తుపాను ప్రభావం రబీసాగుపై తీవ్రంగా పడింది. గతేడాది ఈ సమయానికి డెల్టాలో 50 శాతానికిపైగా నాట్లు పూర్తవ్వగా ఈసారి పలు మండలాల్లో ఇంకా నారుమడులూ పూర్తికాని పరిస్థితి ఉంది. సాగు ఆలస్యమవుతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు నీటి ఎద్దడి సమస్యలు వెంటాడనున్నాయంటూ రైతులు గుబులు చెందుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా రబీలో 3.80 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. డిసెంబర్ మొదటివారంలో రబీ నారుమడులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో తుపాను విరుచుకుపడింది. దీంతో ఖరీఫ్ పంటంతా నీట మునగడంతో రైతులు పంటను కాపాడుకునే పనిలో పడ్డారు. అప్పటికే వేసిన నారుమడులు సైతం నీట మునిగి పనికి రాకుండాపోయాయి. ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నమవ్వడంతో రబీ నారుమడులు వేయడంలో తీవ్ర ఆలస్యం జరిగింది. పలు మండలాల్లో ఇప్పటికీ 60 శాతం మాత్రమే నారుమడులు పూర్తయ్యాయి. కొల్లేరును ఆనుకుని ఉన్న మండలాల్లో ఇంకా నారుమడులు పూర్తి కాలేదు. ప్రతియేటా డిసెంబర్ 20వ తేదీ తర్వాత నాట్లు ప్రారంభమై సంక్రాంతి పండుగకు దాదాపు పూర్తయ్యేవి. ఈసారి నాట్లు ఆలస్యం కావడంతో ఇప్పటికీ నాట్లు సరిగా ప్రారంభం కాలేదు. నాట్లు ఆలస్యమవుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నారుమడి వేసిన 20 రోజులకు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు సిద్ధమవుతున్నారు. లేత నారుతో నాట్లు నాటడం వల్ల ఇబ్బందులు వస్తాయేమోనని భయం మరోవైపు రైతులను వెంటాడుతోంది. నాట్లు పూర్తయ్యేసరికి ఫిబ్రవరి మొదటివారం అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులే అంచనాలు వేస్తున్నారు. నాట్లు ఆలస్యంతో నీటిఎద్దడి సమస్య ఏవిధంగా ఉంటుందోనన్న భయం రైతులను వణికిస్తోంది.



నారుమడి

నీటి ఎద్దడిపై ఆందోళన

రబీలో ప్రతియేటా నీటిఎద్దడి సమస్యను రైతులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత వంతులవారీ విధానం అమలు చేస్తున్నారు. గతంలో పండుగకు నాట్లు పూర్తికావడం వల్ల తర్వాత వంతులు అమలు చేసినా ఇబ్బంది రాలేదు. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పండుగకు సగానికి కూడా నాట్లు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. నాట్లు నాటే సమయంలో దుక్కులకు పెద్దఎత్తున సాగునీరు అవసరం. వంతులు అమలు చేస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. ఈ ఏడాది రబీలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల సాగుకు 91 టిఎంసిల సాగు నీరు అవసరం ఉండగా అందుబాటులో ఉన్నది 82 టిఎంసిలు నీరు మాత్రమే. వంతులవారీ విధానం, కరకట్టలు, మోటారు ఇంజిన్లతో నీరు ఎత్తిపోసే విధానాలతో రబీసాగు గట్టెక్కుతుందని ముందుగానే తేల్చారు. ఫిబ్రవరి తర్వాత సాగునీటి ఇబ్బందులు మొదలవుతాయి. నాట్లు ఆలస్యం కావడంతో ఏప్రిల్ నెలాఖరు వరకూ సాగునీరు అవసరం. ఆఖరులో సాగునీరు ఎద్దడి తలెత్తితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే పరిస్థితి తీవ్రతను రైతులు చవిచూశారు. ముఖ్యంగా కౌలురైతులు సర్వం కోల్పోయారు. రబీలోనూ ఇబ్బందులు తలెత్తితే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. సాగునీటి సరఫరాపై రైతుల్లో తీవ్ర ఆందోళన కొనసాగుతోంది. రబీ సాగుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు - 16వ రోజుకు సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని శ్రీనివాసరావు సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోగా సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉద్యోగులను తొలగిస్తామని బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని, సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యోగులు చేసే పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. పిడిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా, నెల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, ముఖ్యంగా తమను విద్యావ్యవస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వినోద్, ఝాన్సీ, భగవాన్, రాజు, రాధిక, కేశవరావు, సత్య సందీప్, దిలీప్ పాల్గొన్నారు.



ఎంఇఒతో మాట్లాడుతున్న డిఇఒ శ్యామ్‌సుందర్

పదిలో నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక : డిఇఒ

ప్రజాశక్తి - భీమడోలు

పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ తెలిపారు. గురువారం అయిన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల కేంద్రంగా ఎంపికైన భీమడోలు శ్రీచైతన్య పాఠశాలలో ఉన్న సదుపాయాలు, ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం భీమడోలు హైస్కూల్లో నాడు-నేడు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు హాజరయ్యేందుకు అన్ని విధాలుగా సంసిద్ధులను చేసే క్రమంలో చైతన్య పథం పేర స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నామన్నారు. ఐదాగురిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారిపై ప్రత్యేక దృష్టిపెడుతున్నామన్నారు. జిల్లాలో 17,500 ట్యాబ్‌లు అవసరం కాగా ఇప్పటివరకూ విడుదలైన 50 శాతం ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. జగనన్న గోరుముద్ద సత్ఫలితాలిస్తుందని తెలిపారు. ముఖ్యంగా బాలికలు పౌష్టికాహార లోపం నుంచి బయటపడుతున్నారన్నారు. తొలుత జిల్లాలో పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడే బాలికల సంఖ్య 35 వేలు ఉండగా, ప్రస్తుతం 16 వేలకు తగ్గిందన్నారు జగనన్న విద్యా కానుక నూరు శాతం పంపిణీ చేశామన్నారు. జిల్లాలో నాడు నేడు పనులు 859 పాఠశాలల్లో 95 శాతం పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.భాస్కర్‌కుమార్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్ అందిస్తున్న జెసి

వికలాంగులకు పలు సంక్షేమ కార్యక్రమాలు : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. గురువారం దృష్టి లోపం ఉన్నవారికి ప్రత్యేక లిపి ప్రదాత సర్ లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా స్థానిక గిరిజన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జెసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బ్రెయిలీ వైకల్యాన్ని జయించి, అనుకున్న లక్ష్యాన్ని సాధించిన మహనీయుడని కొనియాడారు. వికలాంగులు సమాజంలో అందరితోనూ సమానులేనన్నారు. జిల్లాలో 34,276 మంది వికలాంగులు ప్రతినెలా రూ.10.28 కోట్లు పెన్షన్లుగా అందిస్తున్నామన్నారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దృష్టిలోపం కలిగిన సుమారు 250 మంది వికలాంగులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారితో కేక్ కట్ చేయించారు. అర్హత ఉండి దృష్టి లోపం కలిగిన వారికి ల్యాప్‌టాప్‌లు లావణ్య వేణి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. 15 మంది దృష్టి లోపం కలిగినవారిని సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

మెమోలకు బెదిరేది లేదు

24వ రోజు సమ్మెలో అంగన్వాడీలు స్పష్టం - కలెక్టర్ మెమోలు దహనం - పలుచోట్ల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కలెక్టర్ల ద్వారా మెమోలు ఇప్పించి బెదిరించినంత మాత్రాన వెనక్కితగ్గేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. జిల్లాలో అంగన్వాడీల సమ్మె 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలుచోట్ల వినూత్నంగా నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలబడి, గడ్డితింటూ తమ నిరసన తెలిపారు. అలాగే అంగన్వాడీలకు కలెక్టర్ జారీచేసిన మెమో కాపీలను దహనం చేశారు.

ఏలూరు అర్బన్: అంగన్వాడీల సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, పి.హైమావతి, టి.రజని మాట్లాడుతూ అంగన్వాడీలు 24 రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తుందని విమర్శించారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరివీడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను లబ్ధిదారులకు అందించడంలో అంగన్వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నారని, అలాంటి అంగన్వాడిల సమస్యలు

మండవల్లిలో..

పరిష్కరించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్, యూనియన్ కార్యదర్శి దుర్గాభవాని, స్వప్న, నవతి, మల్లిక, రామలక్ష్మి, సిఐటియు ఏలూరు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు పాల్గొన్నారు.

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్వాడీల్లో ఎక్కువమంది దళిత, వెనుకబడిన తరగతుల వారే ఉండటంతో ప్రభుత్వం వారిని చులకనగా చూస్తుందని విమర్శించారు. అంగన్వాడీలు చేసే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

పెదపాడు : అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మోకాళ్లపై నిలబడి అంగన్వాడీలు నిరసన తెలిపారు. కనీస వేతనాలు ఇవ్వాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లాకార్యదర్శి కె.శ్రీనివాస్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెదపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎస్.తిరుపతమ్మ మాట్లాడుతూ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను సిఎం జగన్ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలుమార్లు విజ్ఞప్తులు, ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో అంగన్వాడీలు రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. సమ్మె విచ్ఛిన్నానికి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు కుట్రలు చేయడం మానుకోవాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కె.శారద, నాయకులు సీతామహాలక్ష్మి, శ్రీకుమారి, దుర్గ, దేవమణి, వినీల, నాగలక్ష్మి, శివలీల, సిపిఎం నాయకులు షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

నూజివీడు : పట్టణంలో అంగన్వాడీల సమ్మె 24వ రోజూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌ఆర్.హనుమాన్లు, జి.రాజు, అంగన్వాడీల యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పద్మ, జ్యోతి, విజయలక్ష్మి, మణి, ప్రసన్న, శ్యామల, ఝాన్సీ, వసుంధర పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలోని అంగన్వాడీలు 24వ రోజు సమ్మెలో భాగంగా పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో గడ్డితిని బతకాల్సిందేనని వాపోయారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేణి, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతారాయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, మంగ, శ్రీదేవి, నుర్జహాన్ పాల్గొన్నారు.

అంగన్వాడీలను మోసగించిన జగన్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఏలూరు అర్బన్ : అంగన్వాడీలను సిఎం జగన్ ఘోరంగా మోసగించారని, నాలుగున్నరేళ్లయిన వారికిచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులో అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ అంగన్వాడీలకు తెలంగాణా కంటే అదనంగా జీతం ఇస్తామని హామీ ఇచ్చి నేటి వరకూ అమలు చేయలేదన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా కలెక్టర్లతో నోటీసులిప్పించి వారి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బెదిరింపులకు భయపడి వెనక్కి తగ్గకుండా అంగన్వాడీలు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే సిపిఎం తరపున కూడా ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. పంతాలకుపోకుండా ముఖ్యమంత్రి ఇప్పటికైనా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చింతలపూడి : పట్టణంలో అంగన్వాడీల సమ్మె 24వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పంపిన నోటీసులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు ఎన్.సరోజని, టి.మాణిక్యం, సరళ, కవిత, అరుణ, హేమలత, పద్మ పాల్గొన్నారు.

పోలవరం : సమ్మెను విరమించి తక్షణం విధుల్లోకి చేరాలంటూ కలెక్టర్ పంపిన మెమోను అంగన్వాడీలు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీలు విధుల్లోకి చేరాలంటూ కలెక్టర్ పంపిన మెమోను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు నాగమణి, సరళ, పూర్ణావతి, ఎస్తేరు, జ్యోతి పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని అంగన్వాడీలు ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. గంగిరెద్దుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 రోజులుగా నిరసనలు, నిరాహార దీక్షలు చేపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి, కలపాల విద్యావతి, మేరీ సులోచన, శిరీష, లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కుక్కునూరు : సిఎం జగన్ మొండివైఖరి వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ కోరారు. సమ్మె 24వ రోజుకు చేరిన సందర్భంగా జగన్ ఫొటోతో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడారు. అంగన్వాడీలకు కలెక్టర్ పంపిన మెమో కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి, కోశాధికారి బాడిస సుజాత, కణితి మంగ, వర్స మంగ, భవాని, కస్తూరి, రమాదేవి, మహాలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

ఏలూరులో..

ఉంగుటూరు : మండలంలోని అంగన్వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నూజివీడు రూరల్ : అంగన్వాడీల సమ్మె 24వ రోజూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ కార్యదర్శి ఆదిలక్ష్మి, సిపిఎం నాయకులు ఎన్‌ఆర్.హనుమాన్లు, జి.రాజు, ఆదిలక్ష్మి, లక్ష్మీకాంతం, రమాదేవి పాల్గొన్నారు.

కలిదిండి : అంగన్వాడీలకు కలెక్టర్ జారీచేసిన సర్క్యులర్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు షేక్ అబిదాబేగం, అంగనవాడీల యూనియన్ నాయకులు జెక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

భీమడోలు : స్థానిక సాయిబాబా గుడి ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సందర్శించారు. అనంతరం కలెక్టర్ జారీ చేసిన మెమో కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి, చల్లామణి, రాజామణి పాల్గొన్నారు.

మండవల్లి : తమ డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మె విరమించేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 25వ రోజు సమ్మెలో కలెక్టర్ మెమోలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు వాణి, చెల్లమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీల సమ్మె 24వ రోజూ కొనసాగింది. విధులకు హాజరు కావాలంటూ కలెక్టర్ ఇచ్చిన మెమో కాపీలను అంగన్వాడీలు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్షులు పుష్ప, సుజాత, సీత, మున్ని, కృపామణి, నూర్జహాన్ పాల్గొన్నారు.



ముసునూరులో..

పదో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల సమ్మె గురువారానికి పదో రోజుకు చేరింది. ఈ సమ్మెకు డ్రైవర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా స్థానిక వంగాయగూడెంలోని వెహికల్ డిపో వద్ద చెత్తసేకరణ వాహనాలు బయటకు రాకుండా అడ్డుకున్నారు. మద్దతు తెలిపిన ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్ద వెంకట్రావు, ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అంతర్వేది శేఖర్, పంతగాని రాజేష్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, ప్రభుత్వ మొండివైఖరి వీడాలని డిమాండ్ చేశారు. సమ్మె శిబిరాన్ని గురువారం సాయంత్రం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, ఇతర నాయకులు లావేటి కృష్ణారావు, పంతం నాగరాజు, బంగారు వెంకటేశ్వరరావు, గణేష్,

నూజివీడులో..

రాజు, మేతర పాప, భవాని, భాగ్యలక్ష్మి, రమణమ్మ, దావీదు, గోపి పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె గురువారానికి రెండో రోజుకు చేరింది. మున్సిపల్ అధికారులు సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తూ ప్రయివేటు వ్యక్తులతో పారిశుధ్య పనులను చేయిస్తున్న ప్రదేశాల్లో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కె.కృష్ణమాచార్యులు, బండి వెంకటేశ్వరరావు, ఎ.అప్పలరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు నష్టం కలిగించే ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి పట్టణ కార్యదర్శి పుల్లారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రజని, ఉషారాణి, రాణి, పద్మ, భవాని, గోవిందు, పృధ్విరాజు, గాంధీ, రవి, గంగాధర్ పాల్గొన్నారు.

ఏలూరులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

చింతలపూడి : పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పద్మ, కమలమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్టు సభ్యులు

400 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

పేదలకు వైద్య సహాయం అందించడంలో ఎంతో మానసిక సంతృప్తి ఉందని అబ్బూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అబ్బూరి వెంకట రవీంద్ర పేర్కొన్నారు. గురువారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో అబ్బూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు డాక్టర్ దత్తు ఆధ్వర్యంలో 10 మంది కంటి వైద్యులు సుమారు 400 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, వారిలో కొందరికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో లక్క పాము కాంతారావు, గొల్ల అంజనేయులు, వంకదార విగ్నేశ్వర రావు, పాసం నాగబాబు, రంగ వాసు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులతో షెడ్లు నిర్మాణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో మేకలు, గొర్రెల పెంపకానికి షెడ్లు నిర్మించుకోడానికి అనుమతులు వచ్చాయి. మండలంలో 20 షెడ్లు నిర్మించాలని జిల్లా అధికారులు టార్గెట్ ఇచ్చారని ఎంపిడిఒ గంటా శ్రీలక్ష్మి పేర్కొన్నారు. పెంపకందార్లు దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఎంఎస్ఆర్ఇజిఎస్ మండల ఎపిఒను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రామాల సర్పంచులు నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారితో దరఖాస్తులు చేయించేలా చొరవ చూపాలని కోరారు. ఉంగుటూరు మండలానికి 20 షెడ్లు టార్గెట్ ఇచ్చారని ఎపిఒ మల్లేశ్వరరావు వెల్లడించారు. షెడ్డుల నిర్మాణాలకు సంబంధించి పూర్తి గైడెలెన్సు అందాల్సి ఉందని రాగానే ఎస్టిమేషన్ వేస్తామన్నారు.

తహశీల్దార్ విశ్వనాథరావు మృతి

ప్రజాశక్తి - చాట్రాయి



విశ్వనాథరావు (ఫైల్)

చాట్రాయి మండల తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావుకు గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో హుటాహుటిన విస్సన్నపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 23 రోజులగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు తహశీల్దార్ మృతి వార్త తెలియడంతో ఆయన ఫోటో పెట్టి శ్రద్ధాంజలి ఘటించారు. ఎపి కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైసిపి నాయకులు కారంగుల శ్రీనివాసరావు(వాసు), చెలికాని బాబ్జి, టిడిపి నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, మందపాటి బసవారెడ్డి, చాట్రాయి ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, సూపర్నెంట్ ఎన్.మురళీమోహన్, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - ముసునూరు

మామిడి తోటల్లో మంచి యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చునని మండల ఉద్యానవన శాఖ అధికారి కె.జ్యోతి ప్రియాంక పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొర్లకుంట, తాళ్లవల్లి గ్రామాల్లో మామిడి తోటలను ఉద్యానవన శాఖ అధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఆయా మామిడి తోటల రైతులకు పూత, పిందె పలు రకాల సమస్యలపై వివరించారు. జనవరి, ఫిబ్రవరిలో పూత కనిపించకపోవడంతో ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ మెగ్నీషియం, పాస్పరస్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే ఎక్కువ సంవత్సరాలు ఉన్న మామిడి తోటలో బూజు తెగులు రాకుండా రైతులే ఎండు కొమ్ములను తీసేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొర్లకుంట పిఎసిఎస్ అధ్యక్షులు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, గ్రామ సర్పంచి నక్కన బోయిన సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

డిపాజిట్ బాండ్లు ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్న డిపాజిట్ దారులు

సొసైటీ వద్ద డిపాజిట్ దారుల ఆందోళన

టి.నరసాపురం : స్థానిక సహకార సంఘంలో డిపాజిట్ చేసుకున్న నగదు చెల్లించడం లేదని డిపాజిట్ దారులు కొందరు సొసైటీ వద్ద గురువారం డిపాజిట్ బాండ్లు ప్రదర్శిస్తూ ఆందోళన నిర్వహించారు. గ్రామానికి చెందిన అనుమోలు సీతారత్నం, కన్నం శ్రీను, పలివెల రాంబాబు, ఈషావళి మరికొందరు సొసైటీలో నగదు డిపాజిట్ చేసుకోగా బాండ్లు ఇచ్చారని, బాండ్లు గడువు దాటినా డబ్బులు చెల్లించడం లేదని ఆందోళన చేపట్టారు. కొద్దిసేపు గేట్లు మూసివేసి నిరసన తెలిపారు. దీనిపై సొసైటీ సిఇఒ కె.రాజశేఖర్ స్పందిస్తూ అక్టోబర్ నెలాఖరు నుంచి త్రిసభ్య కమిటీ అందుబాటులో లేదని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి : 13 మంది అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మిట్టగూడెం గ్రామంలో మారుమూల ప్రదేశంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో 13 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ బాల సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, జోద క్రీడలు ఆడినా, కోడిపందాలు నిర్వహించినా ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

జీలుగుమిల్లి : అక్రమంగా తెలంగాణా నుంచి వేగవరం గ్రామానికి మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాటియాకులగూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద గురువారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రగడ బాబు అనే వ్యక్తి తన వద్ద ఉన్న బ్యాగ్‌లో 6 బ్రాందీ బాటిల్స్ పెట్టుకొని సరిహద్దు గుండా వస్తుండగా పట్టుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిళ్లను సీజ్ చేసి, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తాటియాకులగూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద గురువారం సాయంత్రం ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా నుంచి ఎస్.అప్పన్న బాబు కారులో 7 బాటిళ్ల మద్యాన్ని పెట్టుకొని అక్రమంగా ఆంధ్రాకు తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సంక్షేమ పథకాల లబ్ధిని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు



ఒపి బ్లాక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సేవలను సద్వినియోగపర్చుకోవాలని, ఎవరికైనా అవి చేరకుంటే తన దృష్టికి తెస్తే వారికి సైతం న్యాయం చేస్తానని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు హామీ ఇచ్చారు. భీమడోలు మండలంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక తయారీ, ఇతర అంశాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత భీమడోలు హైస్కూల్లో ఆవరణలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతనంగా మంజూరైన 127 మంది లబ్ధిదారులతో పాటు, ఇంతవరకు పింఛన్లు కొనసాగుతున్న 9,036 మందికి పెరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలానికి సామాజిక పింఛన్ల కింద ప్రతినెల సుమారు రూ.2.54 కోట్లు పింఛన్ల రూపంలో అందజేస్తున్నట్టు తెలిపారు. ఆ తర్వాత రూ.1.28 కోట్ల నాబార్డ్ నిధులతో భీమడోలు హైస్కూల్లో నూతనంగా నిర్మించిన 8వ తరగతి గదుల కాంప్లెక్స్ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. దీంతో పాటు రూ.42 లక్షల నాడు-నేడు నిధులతో నిర్మిస్తున్న నూతన భవనం సేవలు త్వరలో అందుబాటులో రానున్నాయని, దీనివల్ల పాఠశాలకు తరగతి గదుల సమస్య తీరుతుందని తెలియజేశారు. ఆ తరువాత భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ. 2.38 కోట్ల నాడు-నేడు, నాబార్డ్ నిధులకు నిర్మించిన ఓపి నూతన బ్లాక్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్య పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత నూతన భవనం నిర్మాణం ద్వారా ప్రజలకు అందుబాటులో రానున్న సేవలు, భవిష్యత్ ప్రణాళిక గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగ, ఎంపిపి కనమాల రామయ్య, భీమడోలు సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీత మాన్ సింగ్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలుచోట్ల నూతన పింఛన్ల పంపిణీ

పోలవరంలో..

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీలో కొత్తగా మంజూరైన పెన్షన్లను గురువారం లబ్ధిదారులకు సర్పంచి సబ్బరపు శ్రీరామమూర్తి, ఎంపిటిసి ఆకుల వరలక్ష్మి, పట్టిసీమ సొసైటీ అధ్యక్షులు పాదం రాజబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు ఆకుల బుజ్జి, తలగంశెట్టి సూర్యచంద్రం, పంచాయతీ సెక్రెటరీ ఎల్‌వివిఎస్ఎన్ మూర్తి, విఆర్ఒ వెంకటేశ్వరరావు, ధర్మేంద్ర, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, నూతన పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పేదల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నట్లు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పెంచిన సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచుకుంటూ వెళు తున్నారని ఆయన తెలిపారు. రూ.3 వేలు పింఛన్ అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

టి.నరసాపురం : దేశ చరిత్రలో అవ్వా తాతలకు రూ.3 వేల పెన్షన్ అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిదేనని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక

టి.నరసాపురంలో పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ వైసిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 7,920 మంది పెన్షన్ దారులకు రూ.2 కోట్ల 21 లక్షల 24 వేల 750 ప్రతి నెలా వాలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను నూరు శాతం అమలు చేస్తూ జగనన్న పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. దశల వారీగా పెన్షన్ అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం పెంచి అందిస్తున్న రూ.3 వేల పెన్షన్ లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపిపి దారబోయిన లక్ష్మి, వాసిరెడ్డి మధు, ఎస్‌విపికెహెచ్ శ్రీనురాజు పాల్గొన్నారు.



హీల్ స్కూల్‌లో బ్రెయిలీ జన్మదిన వేడుకలు

హీల్ స్కూల్‌లో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

స్పర్శతో అక్షరాలను గుర్తించే విధానం ద్వారా అంధులకు కూడా సకల విద్యలను అభ్యసించేందుకు దారి చూపిన మార్గదర్శకుడు డా.లూయిస్ బ్రెయిలీ అని ఫణీంద్ర చుండూరి ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజ్‌వల్లీ ఛాలెంజ్‌డ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సుఖవాసి రష్మంత్ అన్నారు. తోటపల్లి హీల్ స్కూల్‌లో ప్రపంచ బ్రెయిలీ లిపి దినోత్సవం సందర్భంగా అంధుల బంధువు డా.లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్, సిఇఒ కూరపాటి అజయ్ కుమార్, హీల్ అంధ పాఠశాల ఇన్‌ఛార్జి కె.అబ్రహాంలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ పోస్టులకు మెరిట్ లిస్టు సిద్ధం

అభ్యంతరాలకు 9వ తేదీలోగా గడువు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

రెవెన్యూ డిపార్టుమెంటులో అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి 12 టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులను నియమించుటకు 2023 నవంబర్ 10న నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టు సిద్ధం చేసి www.eluru.ap.gov.in, www.west-godavari.ap.gov.inలో పొందుపరచడమైందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ప్రొవిజనల్ మెరిట్ లిస్టు నందు దరఖాస్తు చేసిన ఏ అభ్యర్థికైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వయంగా పరిపాలన అధికారి, కలెక్టర్ వారి కార్యాలయం, ఏలూరు వారికి పూర్తి వివరాలతో అందజేయాల్సిందిగా కలెక్టర్ కోరారు.

టీంతో కోచ్ నాగరాజు

నేషనల్ బాస్కెట్ బాల్ పోటీలకు ప్రభుదీపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణం నుంచి అండర్-17 నేషనల్ గర్ల్స్ బాస్కెట్ బాల్ పోటీలకు బి.ప్రభు దీపిక ఎంపికైనట్లు సీనియర్ కోచ్ పీడీ వాకా నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్‌లో రాజు నందగామ్‌లో ఈనెల 6వ తేదీ నుంచి ఎనిమిదవ తేదీ వరకు నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించుచున్నట్లు తెలిపారు. మన రాష్ట్రం నుంచి పోటీపడే జట్టుకు ప్రభు దీపిక ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

'వాలంటీర్లను దూషించిన కార్యదర్శి'

మండవల్లి : వాలంటీర్లను పరుష పదజాలంతో పంచాయతీ కార్యదర్శి దూషించినట్లుగా ఒక ఆడియో టేప్ మండలంలో హల్‌చల్ చేయడం సంచలనం సృష్టించింది. ఈ ఆడియో టేప్ మండవల్లి పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావుగా ప్రచారం సాగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి గ్రామాల్లో ఆటలు ఆడే యువతను గుర్తించి వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసి, ఆటల్లో పాల్గొని ఆడేలా చూడాలని వాలంటీర్లకు కార్యదర్శి సూచించారు. అయితే ఆటగాళ్లు ఎక్కువ శాతం పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివే యువత కావడంతో, వారికి పరీక్షలు ఉండడంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు రావడం లేదు. దీంతో అసహనం గురై రెచ్చిపోయిన కార్యదర్శి 30 మంది వాలంటీర్లు ఉన్నారు, 50 కుటుంబాల నుంచి కనీసం ఇద్దరిని కూడా తీసుకురాలేకపోయారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాకి వెళ్లాలంటే గంట ముందు, షాపింగ్‌కి వెళ్లాలంటే రోజు ముందే బయలుదేరుతారు. ఇక్కడికి లేటుగా వస్తారా అంటూ ఆడవారు అని కూడా చూడకుండా ఒక్కొక్క దానికి, ఒక్కొక్కడికి ఎటకారాలు ఎక్కువైపోయింది అంటూ వాలంటీర్లపై మండిపడ్డాడు. వస్తున్నారు సార్ అని మగ వాలంటీర్లు చెప్పడంతో ఇంకెప్పుడు వస్తారు, రాత్రంతా ఏం చేశారు అంటూ అసభ్యంగా మాట్లాడాడు. ఎందుకు సార్ ఆడపిల్లలు అని కూడా చూడకుండా అలా మాట్లాడుతున్నారు అని మహిళా వాలంటీర్ కార్యదర్శిని ప్రశ్నించింది. దీంతో రెచ్చిపోయిన కార్యదర్శి ని పేరు పెట్టి ఏమైనా అన్నానా? నీ పేరు పెట్టి అనుంటే కలెక్టర్‌కి రిపోర్ట్ చేసుకో అంటూ మహిళా వాలంటీర్‌పై మండిపడ్డారు. మనస్థాపానికి గురైన మహిళా వాలంటీర్లు ఎంపిడిఒ వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా కార్యదర్శి దురుసు ప్రవర్తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. దీనిపై ఎంపిడిఒ వెంకటరమణ వివరణ కోరగా ఆడియో టేప్ విన్నానని, ఇంకెప్పుడు అలా మాట్లాడొద్దని మందలించడం జరిగిందని చెప్పారు. అయితే వాలంటీర్లు ఇంతటితో సరిపెట్టుకుంటారా లేక కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తారా అనేది వేచి చూడాలి.

జగన్ హయాంలో ప్రతిఒక్కరికీ లబ్ధి

వైసిపి సీనియర్ నాయకురాలు శారద

ప్రజాశక్తి - ముదినేపల్లి

అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి ఎక్స్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యురాలు, సీనియర్ నాయకురాలు, హైకోర్టు న్యాయవాది తిరువీధుల శారద అన్నారు. శ్రీహరిపురం గ్రామంలో వైసిపి కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత నుంచి ఇప్పటి వరకు 2019లో మన జగనన్న ప్రవేశపెట్టిన మెనిఫెస్టోలోని అన్ని పథకాలను నూటికి నూరు శాతం అమలు చేయడం జరిగిందన్నారు. మెనిఫెస్టోలో లేని కొన్ని పథకాలను కూడా అమలు చేయడం జరిగిందన్నారు. రాజ్యాధికారంలో సింహభాగాన్ని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వారికి ఇచ్చి, సామాజిక మహా విప్లవాన్ని ఆవిష్కరించి మనదేశంలోనే అగ్రగామి సిఎంగా నిలిచారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన అన్ని రకాల హామీలను నెరవేర్చారని ఆమె తెలిపారు. నవరత్నాలను జగనన్న అమలు చేయటం ఎంతో హర్షించదగిన విషయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, అమ్మ ఒడి పథకం, ఫీజు రియంబర్స్మెంట్, ఆరోగ్యశ్రీ పథకం, విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, ప్రతి పేదవాళ్ళకి ఇళ్ల పట్టాల మంజూరు, వైఎస్ఆర్ భరోసా కింద అర్హత కలిగిన రైతులకు సంవత్సరానికి రూ. 12,500 ఇవ్వటం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలను ప్రక్షాళనకు నాడు-నేడు కార్యక్రమం, ఆరోగ్య శ్రీ పథకం కింద ఒక కోటి 42 లక్షల 15 వేల ఎనిమిది వందల 20 కార్డులను మంజూరు చేశారన్నారు. అర్హులైన పేదలకు 30 లక్షల 84 వేల 935 ఇళ్ల పట్టాలను మంజూరు చేయటం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 39 లక్షల మంది పెన్షన్ల లబ్ధిదారులు ఉండేవారని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత 64 లక్షల 20 వేల మందికి పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంచినందుకు జగనన్నకు మన రాష్ట్ర ప్రజలందరూ రుణపడి ఉంటారని ఆమె పేర్కొన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ఆయన మన రాష్ట్ర ప్రజలందరికీ కుల, మత, ప్రాంతా, పార్టీలకతీతంగా అర్హులైన అందరికీ అందించారన్నారు. కైకలూరు నియోజకవర్గ ప్రజలందరి తరపున వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేలు, జోదం, మద్యం విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడిపందేలు, పేకాట, మద్యం విక్రయం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారని అన్నారు. అయితే జనవరి 18 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కోడి పందేలు ఆడినా, నిర్వహించిన, మద్యం విక్రయించిన వారిపై చట్టపరమైన కేసు నమోదు చేస్తామని అన్నారు. అంతేకాకుండా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు వ్యవసాయ క్షేత్రాలు గాని స్థలాలు గాని వినియోగించుకునేందుకు అనుమతులు లేవని, అలా నిర్వహిస్తే యజమానులపై కూడా చట్టపరమైన కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా సంక్రాంతి పండుగను కుటుంబాలతో సంతోషంగా గడుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణ, విఆర్ఒలు పాల్గొన్నారు.

సిబ్బందికి తర్ఫీదు : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టే విధంగా సిబ్బందికి ఇప్పటి నుంచే తర్ఫీదు ఇస్తున్నామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశ మందిరంలో రానున్న ఎన్నికల నేపథ్యంలో సార్వత్రిక సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్‌పి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ డివిజన్ పోలీసు అధికారులతో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులను, సిబ్బందిని ఉద్దేశించి ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ సెక్టార్ పరిధిలో జరుగుతున్న, జరిగిన నేరాలపై పూర్తిస్థాయి అవగాహన ఆ సెక్టర్ పోలీసులు కలిగి ఉండాలని ఆమె సూచించారు. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పూర్తిస్థాయి భద్రత వారికి కల్పించాల్సిన బాధ్యత పోలీసుల దేనని ఆమె స్పష్టం చేశారు. పోలింగ్ బూతులను ఇప్పటినుంచే పోలీసుల ఆధీనంలోకి తీసుకొని ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ ఉండాలని ఆమె ఆదేశించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన ముద్దాయిలను బైండోవర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి భాస్కరరావు పాల్గొన్నారు.

రాత్రివేళ గస్తీ ముమ్మరం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ గస్తీని ముమ్మరం చేసామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, సబ్ డివిజన్ పరిధిలలో ఎటిఎం, బ్యాంకుల వద్ద మూడో తేదీ, నాలుగో తేదీ తెల్లవారుజామున గస్తీని ముమ్మరం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాత్రి వేళలో సంబంధిత సబ్ డివిజన్ పరిధిలలో డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళల్లో గంజాయి నిషేధిత గుట్కా వంటివి రవాణా అవుతున్న నేపథ్యంలో వాహన తనిఖీలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.

జెడ్‌పి పాఠశాలను సందర్శించిన సేవియా

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు ఉప విద్యా శాఖాధికారి సేవియా గురువారం మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి, ఎస్ఎ 1 మార్కులు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ గురించి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకాగ్రత, పట్టుదలతో చదవాలని, అందరూ వంద శాతం పాస్ అవ్వాలని, విద్యార్థులు చదువు పట్ల భయం పోగొట్టుకోవాలని కోరారు. చెకుముఖి టాలెంట్ విభాగంలో మండలం ప్రథమ స్థానంలో వచ్చిన నాగ స్పందన, దివ్యశ్రీ, నేహప్రణతిలను అభినందించారు.

రేపు హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈనెల 6వతేది శనివారం ఉదయం 9.30 నిమిషాలకు స్వామివారి హుండీలు తెరచి లెక్కించనున్నట్లు ఆలయ ఎసి నేల సంధ్య గురువారం తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో వివిధ దేవాలయాల అధికారులు, సిబ్బంది, భక్తులు, పాల్గొంటారన్నారు.

ఎస్‌టియు నగర శాఖ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎస్‌టియు ఏలూరు నగర శాఖ కౌన్సిల్ మీటింగ్ స్థానిక ఎస్‌టియు భవనంలో బుధవారం నగరశాఖ అధ్యక్షులు రాఘవులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర ఉన్న సంఘంలో ఉపాధ్యాయులకు సేవ చేసే అవకాశం రావడం ఆనందంగా వుందని తెలియజేశారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ ఎన్నికలో నగరశాఖ అధ్యక్షునిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా కుసుమాకర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు కృష్ణ ఎన్నికల అధికారిగా, జయరామ్ పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి పవన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీహరి, ప్రభాకర్, సోమయాజులు, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

కోఆపరేటివ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు సిబ్బంది జిల్లా కోఆపరేటివ్ భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశామని, త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సమయంలో జిల్లా కోపరేటివ్ బ్యాంకును ఒక చిన్న కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అక్కడే నిర్వహించేవారు. అయితే ప్రత్యేకంగా సిబ్బందికి కోపరేటివ్ బ్యాంకు భవనాన్ని నిర్మించాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి అనుకున్నారు. దీంతో బుధవారం జిల్లా కోపరేటివ్ భవన నిర్మాణానికి జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెబి భాస్కరరావు శంకుస్థాపన చేశారు. త్వరలోనే భవనాన్ని పూర్తి చేసి సిబ్బందికి అందుబాటులో ఉంచుతామని ఆయన తెలియజేశారు.

ఎపి రైతు సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

చింతలపూడి : జనవరి 8, 9, 10 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 18వ మహాసభను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ అన్నారు. చింతలపూడి సిపిఐ కార్యాలయంలో జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తొలి కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ అధ్యక్షతన గురువారం జరిగింది. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడారు. అనంతరం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-01-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2816.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
ELURU AREA CELL NO- 80088 12798